క్లుప్తంగా

క్రీడలతో మానసికోల్లాసం



గార్ల: క్రీడలతో శారీరక మానసికోల్లాసంతో పాటు యువకుల్లో దేహదారుఢ్యం పెంపొందుతుందని కాంగ్రెస్ నాయకుడు రాంరెడ్డి చరణ్‌రెడ్డి అన్నారు. మాజీ మంత్రి రాంరెడ్డి వెంకట్‌రెడ్డి జ్ఞాపకార్థం మండలంలోని ముల్కనూరులో ఆదివారం గార్ల, బయ్యారం మండలాల క్రికెట్ పోటీలను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో ఇల్లందు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకురాలు గుండెబోయిన నాగమణి, జాస్తి సాగర్‌బాబు, చిలుకబాబు, కామేపల్లి మండల అధ్యక్షులు నర్సిరెడ్డి, సాంబశివరావు, జనార్ధన్, ఎం రామారావు, చింత కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణ చిరస్మరణీయుడు

గార్ల : సీపీఐ మండల మాజీ కార్యదర్శి ఎల్లంకి లక్ష్మీనారాయణ ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడిగా నిలిచాడని సీపీఐ పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు కట్టెబోయిన శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం గార్లలో ఎల్లంకి 2వ వర్ధంతి సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. తొలుత ఆయన స్తూపం వద్ద పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సభలో పార్టీ మండల కార్యదర్శి జంపాల వెంకన్న, రాగం రమేష్, మాగం లోకేష్, సింగు రమేష్, నాగేష్, బి శ్రీనివాసాచారి, సరిత, సాయి, లాలుప్రసాద్, అమృతమ్మ, నాగరాజు, వెంకటనర్సమ్మ, రాజేష్, మహేష్, మురళి, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

గార్ల : స్థానిక గ్రామ పంచాయతీ పూమ్యాతండాలో ఇళ్లు లేని నిరుపేదలు ఇళ్ల స్థలాల కోసం ఈనెల 6లోపు తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ రాము ఆదివారం తెలిపారు. పూమ్యాతండా ప్రజలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, అర్హులైన వారికి 75 గజాల ఇళ్ల స్థలం కేటాయిస్తామని సూచించారు.

పోస్టర్ ఆవిష్కరణ

మహబూబాబాద్ రూరల్ : ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని దిశ సామాజిక సేవా సంస్థ అవగాహన పోస్టర్‌ను ఆదివారం విడుదల చేసింది. ఈ సందర్భంగా వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ వి.గురునాథరావు మాట్లాడుతూ ఐరాస ఎన్విరాన్ మెంట్ ప్రోగ్రాం (యూఎన్‌ఈపీ) ఏటా ఏదో ఒక అంశంతో పర్యావరణంపై ప్రజల్లో అవగాహన పెంచే ప్రయత్నాలు చేస్తోందన్నారు. ఈఏడాది థీమ్ 'ప్లాస్టిక్ కాలుష్యాన్ని ఓడించండి' అని ప్రకటించిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో దిశ ప్రజల్లో ప్లాస్టిక్ వస్తువులను, సంచులని వాడితే కలిగే అనర్థాలపై అవగాహన కలిగించటానికి ఈ ఆన్‌లైన్‌లో పోస్టర్‌ను విడుదల చేసిందని తెలిపారు. ప్రజలు సింగల్ యూస్ ప్లాస్టిక్స్ ని తిరస్కరించాలని సూచించారు.

'సాగునీటి వనరులు కల్పించడంలో విఫలం'

బయ్యారం : ఎన్నికల ముందు హామీ ఇచ్చిన రుణమాఫీని మరవడంతో పాటు సాగునీటి వనరులను కల్పించడంలో విఫలమైన రాష్ట్ర ప్రభుత్వం రైతుల పేరుతో ఉత్సవాలు చేయటం ఏమిటని సీపీఎం మండల కార్యదర్శి నంబూరి మధు ప్రశ్నించారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాకతీయుల కాలంలో నిర్మించిన బయ్యారం చెరువును అభివృద్ధి చేయకపోగా చెరువులోని నీరు మొత్తం వృథాగా వెళ్తున్నా అధికారులు పట్టించుకోవటం లేదన్నారు. ఇప్పటికైనా రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ పథకాన్ని వర్తింపచేయాలన్నారు.

బొడ్రాయి పునఃప్రతిష్ఠకు ఏర్పాట్లు పూర్తి

కురవి: మండల కేంద్రంలో బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన ఉత్సవాల ఏర్పాట్లు పూర్తయ్యాయి. సోమవారం నుంచి వేడుకలు ప్రారంభం కానున్నాయి. బొడ్రాయి దాత బుక్కా వీరన్న-స్వాతి దంపతుల ఆధ్వర్యంలో జరగబోయే ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వారు ఆదివారం తెలిపారు. సోమవారం బొడ్రాయి, ముత్యాలమ్మతల్లి, పోతురాజుల విగ్రహాలను ఊరేగింపు నిర్వహించనున్నట్లు చెప్పారు.

జిల్లా పేరు మార్చడంలో నిర్లక్ష్యం



గార్ల: గార్ల మండలం ఇంకా ఖమ్మం జిల్లాలో ఉన్నట్లుగానే మండలంలోని పీక్లీతండా జీపీఎస్ భవనంపై మహబూబాబాద్ జిల్లా పేరు కాకుండా గార్ల మండలం ఖమ్మం జిల్లా అనే ఉంది. కొత్తగా జిల్లాలు ఏర్పడి దాదాపు రెండేళ్లు దాటినా హెచ్‌ఎం నేటికీ మహబూబాబాద్ జిల్లా పేరు మార్చడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

'మహిళా సమ్మాన్'తో ఆర్థిక భరోసా

- ఈ సంవత్సరం ఏప్రిల్ 1 నుంచి తపాలా శాఖలో ప్రారంభం
- వరంగల్ డివిజన్‌లో 1500కు పైగా ఖాతాలు
- విస్తృతంగా ప్రచారం చేస్తున్న సిబ్బంది



జిల్లా కేంద్రంలోని ప్రధాన తపాలా కార్యాలయం

మహబూబాబాద్ : తపాలా శాఖ సేవలను విస్తృతం చేస్తుంది. కొత్త పథకాలతో ప్రజలను ఆకట్టుకుంటుంది. అందులో భాగంగానే కేంద్ర ప్రభుత్వం 2023–24 ఆర్థిక సంవత్సరంలో మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ స్కీంను ప్రవేశపెట్టింది. అధిక వడ్డీతో ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి ప్రారంభం కాగా వరంగల్ డివిజన్ పరిధిలో ఇప్పటి వరకు 1500 పైగా ఖాతాలను తెరిపించారు. 18 సంవత్సరాలు నిండిన మహిళకు ఈ ఎంఎస్ఎస్‌సిని ప్రవేశపెట్టింది. ఈ స్కీంకు అనూహ్య స్పందన రావడంతో దీనిపై ప్రజలకు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. వరంగల్ పోస్టల్ డివిజన్‌లో వరంగల్, మహబూబాబాద్ హెడ్ పోస్టాఫీస్‌లు ఉన్నాయి. వరంగల్ హెడ్ పోస్టాఫీస్‌లో పరిధిలో 27 సబ్ పోస్టాఫీస్‌లు, 169 బ్రాంచి పోస్టాఫీస్‌లు ఉన్నాయి. మహబూ బాబాద్ హెడ్ పోస్టాఫీస్ పరిధిలో 15 సబ్ పోస్టాఫీస్‌లు 195 బ్రాంచ్‌లు ఉన్నాయని ఆశాఖ అధికా రులు తెలిపారు. మహిళలు, ఆడపిల్లల ఆర్థిక భవిష్యత్ కోసం , స్వయం సమృద్ధి కోసం కేంద్రం ప్రవేశ పెట్టిందని ప్రచారం చేస్తున్నారు.

18 ఏళ్లు నిండిన వారికే..

18 ఏళ్లు నిండిన అమ్మాయిలు కనీసం రూ.1000 నుంచి గరిష్టంగా రూ. 2 లక్షలతో మహిళా సమ్మాన్ ఖాతాను తెరవవచ్చు. ఈ పథకానికి 7.5 శాతం త్రైమాసిక చక్రవడ్డీతో చెల్లిస్తారు. దీని కాలవ్యవధి రెండేళ్లసారి ఈ ఖాతాను తెరిచిన తర్వాత మూడు నెలల వరకు ఖాతాను తెరవవద్దు. ఏదైనా అవసర నిమిత్తం ఒక సంవత్సరం తర్వాత 40 శాతం నగదును పొందవచ్చు. ఖాతా తెరిచిన ఆరునెలల



బాలికకు ఖాతా పుస్తకం అందజేస్తున్న సిబ్బంది

తర్వాత 2 శాతం వడ్డీ తగ్గించుకుని 5.5 శాతంతో ఖాతాను ఉపసంహరించుకోవచ్చు, ఈ అవకాశం మార్చి 31, 2025 వరకు మాత్రమే కల్పించారు.

ఖాతా తెరవడానికి..

ఖాతా తెరవడానికి ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, మూడు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, తీసుకుని సమీపంలోని బ్రాంచ్ పోస్టాఫీస్,సబ్‌పోస్టాఫీస్, హెడ్‌పోస్టాఫీస్‌లో ఖాతా తెరవచ్చు. రూ.లక్ష డిపాజిట్ చేస్తే రెండేళ్ల తర్వాత రూ 1,16,022 వస్తాయి. రూ.2 లక్షలు డిపాజిట్ చేస్తే రెండేళ్ల తర్వాత రూ 2,32,044 వస్తాయని తెలిపారు.

దేశ జనాభాలో సగం మహిళలే....

భారత దేశ జనాభాలో సగం మహిళలే ఉన్నందున కేంద్రం మహిళల ఆర్థిక భవిష్యత్ కోసం ఈ స్కీంను ప్రవేశపెట్టింది. ఆ మహిళల్లో దినసరి కూలీలు, వ్యవసాయ ఆధారిత పనులు , కులవృత్తులు, చేతి వృత్తులు, చిరు వ్యాపారం చేసే వారు అధికంగా ఉన్నారని అధికారులు చెబుతున్నారు. ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం తపాలా శాఖ ద్వారా అందుబాటులోకి తెచ్చింది. మహిళలు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఈ స్కీంలో అత్యధిక వడ్డీ ఉంది



ఈ స్కీంలో అత్యధిక వడ్డీ ఉంది. మహిళల ఆర్థిక భరోసా కోసమే కేంద్ర ప్రభుత్వం ఈ స్కీంను ప్రవేశపెట్టింది. కేవలం 45 రోజుల్లోనే 1500పైగా ఖాతాలు తెరిచారు. గ్రామాల్లో కూడా తపాలా శాఖ సిబ్బంది మహిళలకు ఈ పథకంపై అవగాహన కల్పిస్తున్నారు.

– నర్సింహస్వామి, వరంగల్ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్

పాకాల ఏటిపై బ్రిడ్జి నిర్మాణం కోరుతూ జలదీక్ష



జలదీక్ష చేస్తున్న బీఎస్పీ నాయకులు, బ్రిడ్జి సాధన కమిటీ నాయకులు

గార్ల: గార్ల సమీపంలో పాకాల ఏటిపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరుతూ ఆదివారం పాకాల ఏటిలో బీఎస్పీ నాయకులు, బ్రిడ్జి సాధన కమిటీ నాయకులు రెండు గంటల పాటు జలదీక్ష చేపట్టారు. జలదీక్షను ఉద్దేశించి బీఎస్పీ ఇల్లందు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాదావత్ ప్రతాప్ మాట్లాడుతూ గార్లకు కూతవేటు దూరంలో ఉన్న రాంపురం, మద్దివంచ పంచాయతీల గ్రామాల ప్రజలు వర్షాకాలంలో 3 నెలల పాటు పాకాల ఏటి వరద ఉధృతి వలన నిత్యావసరాలు తీర్చుకునేందుకు గార్లకు రాలేక పక్క మండలాలకు వెళ్తూ నానా ఇబ్బందులు పడుతుంటారని ఆవేదన వ్యక్తం చేశారు. పాకాల ఏటి వరద చెక్ డ్యాంపై నుంచి ప్రవహిస్తుండటంతో వర్షాకాలంలో రైతులు, బడిపిల్లలు రైల్వే బ్రిడ్జి పైనుండి బిక్కుబిక్కుమంటూ వస్తూ నరకయాతన పడుతుంటారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత ఎంపీ, ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ స్పందించి పాకాల ఏటిపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టి ఆయా గ్రామాల ప్రజల కష్టాలు కడతేర్చాలని డిమాండ్ చేశారు. జలదీక్షలో బీఎస్పీ మండల అధ్యక్షుడు అజ్మీరా వెంకన్న, వాగ్య, రాంకుమార్, నవీన్, సంపత్, బ్రిడ్జి సాధన కమిటీ నాయకులు కొమ్మరాజు జగదీష్, ఆడెపు వెంకటేశ్వర్లు, రామగిరి శ్రీను, పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

- మంత్రి సత్యవతిరాథోడ్



బాధిత కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న మంత్రి

దంతాలపల్లి: మండలకేంద్రంలో ఈ నెల 1న రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబంలో నలుగురు చనిపోవడంతో ఆదివారం గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుల చిత్రపటాలకు పూల మాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రమాదం ఎలా జరిగిందో తెలుసుకొని బీఆర్ఎస్ తరుపున అన్ని విధాలుగా ఆదుకుంటామని తెలిపారు. మంత్రి వెంట బీఆర్ఎస్ జిల్లా నాయకులు, దాట్ల సర్పంచ్ కొమ్మినేని రవీందర్, దంతాలపల్లి, ఆగాపేట, గన్నేపల్లి సర్పంచ్‌లు సుష్మిత, సంధ్య, వెంకటనారాయణ, మాజీ సర్పంచ్‌లు పర్శయ్య, సరబోయిన వెంకన్న, లింగయ్య, తదితరులు ఉన్నారు.

గందరగోళంగా వీఆర్ఏల జాబితా

- జిల్లాలో విధులు నిర్వహిస్తున్న 510 మంది
- జాబితాను సిద్ధంచేసే పనిలో అధికారులు

నెల్లికుదురు: వీఆర్ఏలను క్రమబద్ధీకరించి వివిధ శాఖల్లో భర్తీ చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది. జిల్లాలోని వివిధ మండలాల్లోని గ్రామాల్లో వీఆర్ఏలుగా పనిచేస్తున్న వారి జాబితాను సిద్ధం చేసే పనిలో రెవెన్యూ అధికారులు నిమగ్నమయ్యారు. అయితే జాబితాను ఉన్నతాధికారులకు పంపించడంలో మండలంలోని రెవెన్యూ కార్యాలయంలో గందరగోళం చోటు చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇదే విషయంపై కొంతమంది స్థానిక తహసీల్ కార్యాలయంలో ఆర్టీఏ యాక్ట్ కింద సమాచారం కోసం గతనెల 30న అడిగినట్లు తెలిసింది. జిల్లాలో 16 మండలాల్లో మొత్తం 510 మంది వీఆర్ఏలుగా పనిచేస్తున్నారు. వీరిలో 80 మంది రిక్రూట్‌మెంట్ వారు ఉండగా 480 మంది వారసత్వంగా పనిచేస్తున్న వారు ఉన్నారు. రెగ్యులర్‌గా పనిచేసే వారితో పాటు 2018కి ముందు మరికొంత మందిని వీఆర్ఏలుగా గ్రామాల్లో తాత్కాలిక పద్ధతిన తీసుకున్నారు. పనికాలం పరిమితి ముగిసిన అనంతరం వారి పదవుల నుంచి తొలగించి ఐదేళ్లు గడిచింది. అయితే వీఆర్ఏలు తమ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా ప్రభుత్వం వీఆర్ఏలను క్రమబద్ధీకరించే నిర్ణయం మేరకు పనిచేస్తున్న వీఆర్ఏల పూర్తి వివరాల జాబితాను అన్ని మండలాల రెవెన్యూ అధికారులు సేకరిస్తున్నారు. కానీ కొంతమంది వీఆర్ఏలుగా పనిచేసి తొలగించబడిన వారు తహసీల్దార్లను మచ్చిక చేసుకుని తమపేర్లను బాజితాలో చేర్పిస్తున్నారని సమాచారం. దీంతో వీఆర్ఏలుగా పనిచేస్తున్న వారు మా క్రమబద్ధీకరణకు ఎక్కడ ఆటంకం ఏర్పడుతుందోనని రెగ్యులర్ వారు ఆందోళన చెందుతున్నారు. 2018లో తొలగించబడిన వారిని ఎలా వీఆర్ఏల జాబితాలో చేర్చారనే దానిపై ఉన్నతాధికారులు ఏం చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందేనని చర్చించుకుంటున్నారు. మండలంలోని మునిగలవీడుకు చెందిన బాధితుడు షేక్ సలీం మా గ్రామానికి చెందిన షేక్ యాకూబ్ పాషా అక్రమ పద్ధతిన తాత్కాలిక వీఆర్ఏగా విధులు నిర్వహించి తొలగించబడి ఐదేళ్లు గడిచినప్పటికీ మళ్లీ పాషాను రెగ్యులర్ చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిసింది. ఆ నియామకాన్ని వెంటనే నిలిపివేసి నాకు న్యాయం చేయాలని కోరుతూ మే 31న కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసినట్లు సలీం తెలిపాడు. ఇలాంటి సంఘటనలు జిల్లాలో ఎన్ని జరుగుతున్నాయో అధికారులు పర్యవేక్షణ ఎలా ఉంటుందో వేచి చూడాల్సిందే.

అకాల వర్షానికి తడిసిన ధాన్యం బస్తాలు



తడిసిన ధాన్యం నీళ్లలో కొట్టుకుపోకుండా మట్టికట్టలు కడుతున్న రైతులు

మహబూబాబాద్ రూరల్ : మండలంలో ఆదివారం సాయంత్రం అకాల వర్షంతో పలు గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయింది. పర్వతగిరి గ్రామంలోని ఐకేపీ సెంటర్లో అకాల వర్షానికి తడిసిన ధాన్యంను రైతులతో కలిసి సీపీఐ మండల కార్యదర్శి తండ సందీప్ సందర్శించి మాట్లాడారు. గత రెండు నెలలుగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో బస్తాలను కాంటా పెట్టిన తర్వాత కూడా ధాన్యాన్ని తరలించకపోవడంతో రైతులు చాలా అవస్థలకు గురవుతున్నారన్నారు. అలాగే ఒక బస్తాకు రూ.15 వెయిటింగ్ చార్జితో పాటు రూ.15 అదనంగా లాట్ వేసినందుకు రూ.15 హమాలీ చార్జీలు వసూలు చేస్తున్నారన్నారు. ఒక బస్తాకు నాలుగు నుంచి ఐదు కిలోల వరకు కోతలు పెట్టి రైతులను మోసం చేస్తున్నారని, తక్షణమే ఉన్నత అధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకొని కొనుగోలు కేంద్రంలోని ధాన్యాన్ని ఎటువంటి కొర్రీలు లేకుండా తరలించాలని డిమాండ్ చేశారు. ఒకపక్క దశాబ్ది ఉత్సవాల పేరుతో వందల కోట్లు ఖర్చు పెడుతూ రైతు పక్షపాతి అని గొప్పలు చెప్పుకుంటూ రైతులను గోస పుచ్చుకుంటున్నారన్నారు. ఆయన వెంట రైతులు పాల్గొన్నారు.

సీపీఎం నుంచి ఇద్దరు సస్పెన్షన్



మరిపెడ రూరల్: సీపీఎం నుంచి ఇటీవల బీఆర్ఎస్‌లో చేరిన ఎల్లంపేటకు చెందిన కొయ్యడ రామయ్య, బత్తెం శ్రీనివాస్‌ను పార్టీ నుంచి సస్పెన్షన్ చేస్తున్నట్లు ఆ పార్టీ మండల కార్యదర్శి దుండి వీరన్న తెలిపారు. మండలంలోని ఎల్లంపేటలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వీరన్న మాట్లాడుతూ తమ స్వార్థ ప్రయోజనాలకు కోసం సీపీఎం పార్టీని వీడి వెళ్లారని ఆరోపించారు. వారి ప్రాథమిక సభ్యత్వాన్ని రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ఇక నుంచి సీపీఎంకు వారికి ఎలాంటి సంబంధం లేదని వెల్లడించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బాణాల రాజన్న, వెంకన్న పాల్గొన్నారు.

పీవైఎల్ మహాసభలను విజయవంతం చేయాలి



బైక్ ర్యాలీగా వెళ్తున్న పీవైఎల్ కార్యకర్తలు

కొత్తగూడ : ఖమ్మంలో జరిగే పీవైఎల్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ ఆ సంఘం కార్యకర్తలు మండల కేంద్రంలో ద్విచక్ర వాహనాలపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీవైఎల్ జిల్లా నాయకుడు బెల్లి సుధాకర్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై యువతలో చైతన్యం నింపడానికి పీవైఎల్ మహాసభలు ఉపయోగపడతాయని అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో పర్యటిస్తూ ప్రచారం చేశారు. కార్యక్రమంలో పూర్ణచందర్, గణేష్, పుల్లన్న, శ్రీశైలం, దేవేందర్, రాకేష్, అజయ్, యుగేంధర్ పాల్గొన్నారు.

సుదర్శన్ మృతి తీరని లోటు

కొత్తగూడ: మావోయిస్ట్ కేంద్ర కమిటీ సభ్యుడు సుదర్శన్ మృతి విప్లవ ఉద్యమానికి తీరని లోటని సీపీఐ(ఎంఎల్), న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు బుర్క వెంకటయ్య అన్నారు. ఆదివారం స్థానిక సీపీఐ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సుదర్శన్‌కు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెత్తందార్లకు వ్యతిరేకంగా 1974 నుంచి విప్లవ పంథాలో పోరాటాలు నిర్మించిన ఘనత సుదర్శన్‌కే దక్కుతుందని ఆయన అన్నారు.

క్రైం కార్నర్

రైలు నుంచి జారిపడి వ్యక్తికి తీవ్రగాయాలు

డోర్నకల్: స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో ఆదివారం గుర్తుతెలియని రైలు నుంచి జారిపడి ఓ వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యాడు. స్టేషన్ సమీపంలోని సిగ్నల్‌తండా వద్ద రైలుపట్టాల ప్రక్కన గాయాలతో వ్యక్తి పడి ఉన్నాడని స్థానికులు 108 కు సమాచారం అందించారు. 108 వాహనం ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుడి వద్ద లభ్యమైన ఆధార్ కార్డులోని వివరాల ప్రకారం బిహార్ రాష్ట్రంలోని షేక్‌పురా ప్రాంతానికి చెందిన అభిజిత్‌గా గుర్తించారు.

నిప్పంటుకుని గడ్డివాము దగ్ధం



చిన్నగూడూరు : నిప్పంటుకుని గడ్డివాము దగ్ధమైన సంఘటన మండలంలోని ఉగ్గంపల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. రైతు కరుణాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. తనకున్న 6 ఎకరాల వ్యవసాయ భూమిలో వరిపంట నూర్పిడి చేసి పశువుల దాణా కోసం పొలంలో గడ్డివాము పేర్చినట్లు తెలిపారు. చుట్టూ ఉన్న రైతులు తమ పంట వ్యర్థాలకు నిప్పు పెట్టడంతో వీచిన గాలికి తన గడ్డివాము దగ్ధమైందన్నారు. సుమారుగా 200లకు పైగా గడ్డిమోపులు కాలిపోయి రూ.30 వేల నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తెలిపారు.

కేసముద్రం: ప్రమాదవశాత్తు నిప్పంటుకుని గడ్డివాము దగ్ధమైన సంఘటన మండలంలోని రంగాపురంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం..గ్రామానికి చెందిన కరుణాకర్‌కు చెందిన రెండున్నర ఎకరాల గడ్డిని చేనువద్ద ఉంచాడు. కొంతదూరంలో మొక్కజొన్న చొప్పకు నిప్పు పెట్టడంతో, ఆ మంటలు వ్యాపించి గడ్డివాముకు అంటుకుని దగ్ధమైనట్లు తెలిపారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ

కురవి: మండలంలోని నేరడ గ్రామంలోని ప్రధాన రహదారి నుంచి కాటమయ్య గుడివరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎంపీపీ గుగులోత్ పద్మావతి రవినాయక్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గౌడ కులస్తుల కోరిక మేరకు ఎంపీపీ నిధుల నుంచి ఎమ్మెల్యే రెడ్యానాయక్ సహకారంతో పనులు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గుండోజు శ్రీనివాసాచారి, సొసైటీ చైర్మన్ దొడ్డ గోవర్ధన్‌రెడ్డి, ఉప సర్పంచ్ మామిడాల హేమంత్, నాయకులు మల్లెపాక మధు, నీలం నాగరాజు, కాంతయ్య, మదూరి యాకయ్య, కొత్త నరేష్, సత్యమూర్తి, మేఘరాజు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

రేషన్‌డీలర్లకు గౌరవ వేతనం ప్రకటించాలి



డోర్నకల్: రేషన్ డీలర్లకు ప్రభుత్వం వెంటనే కనీస వేతనం ప్రకటించాలని రేషన్‌డీలర్ల సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు తేజావత్ లక్ష్మానాయక్ డిమాండ్ చేశారు. డీలర్ల డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్నకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా లక్ష్మానాయక్ మాట్లాడుతూ కనీస గౌరవ వేతన డిమాండ్‌తో రేషన్ డీలర్లంతా దుకాణాలను మూసి సమ్మె బాట పట్టినట్లు తెలిపారు. సమ్మెకు సీఐటీయూ నాయకులు దాసరి మల్లేశం, న్యూడెమోక్రసీ నాయకులు యాసా వెంకటనారాయణ సంఘీబావం తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు మల్లం అనిల్, వెంకటరెడ్డి, వీరన్న, సత్యనారాయణ,రాంబాబు, శ్రీను, గురవయ్య, రవి పాల్గొన్నారు.

రైతు సంబురాలు చేసుకోవడం సిగ్గుచేటు

నెల్లికుదురు: రెండు నెలలుగా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యంతో ఎండలు, వర్షాలతో రైతులు తీ వ్ర ఇబ్బందులు పడుతుంటే ధాన్యాన్ని తరలించేది వదిలేసి కేసీఆర్ ప్రభుత్వం రైతు సంబురాలు జరుపుకోవడం సిగ్గు చేటని సొసైటీ డైరెక్టర్ బాలాజీ నాయక్ అన్నారు. మండలంలోని నైనాల గ్రామ పరిధిలోని సొసైటీ కొనుగోలు కేంద్రం వద్ద కాంటాలు పెట్టిన ధాన్యం బస్తాలను తరలించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం రైతులతో కలసి నిరసన వ్యక్తం చేశారు. రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడిలో నాణ్యమైన విద్య



బయ్యారం: ప్రభుత్వ బడిలో నాణ్యమైన విద్య అందుతుందని ఎంపీపీ చేపూరి మౌనిక అన్నారు. స్థానిక బాలికోన్నత పాఠశాల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో పాటు ఉచితంగా విద్య అందుతుందన్నారు. సర్పంచ్ కోటమ్మ, ఎస్ఎంసీ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, హెచ్‌ఎం విజయకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంపీటీసీలపై ఎందుకింత వివక్ష ?

నెల్లికుదురు: ఎంపీటీసీలుగా గెలిచి నాలుగేళ్లు గడుస్తున్నా కేసీఆర్ ప్రభుత్వానికి ఎంపీటీసీలపై ఎందుకింత వివక్షత అని ఎంపీటీసీ, యువమోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గుగులోతు మదన్ ఆవేదన వ్యక్తం చేశాడు. మండలంలోని నల్లగుట్టతండాలో కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ నిధుల నుంచి రూ.5 లక్షలతో సీసీరోడ్డు పనులను సర్పంచ్ బీముడుతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వానిది సొమ్ముకరిది సోకకరిదిలా ఉందని కేంద్ర ప్రభుత్వ నిధులతో గ్రామాలను అభివృద్ధి చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటుందని ఎద్దేవా చేశారు. ఎంపీటీసీలకు కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను కేటాయించి గ్రామాల్లో తలెత్తుకునేలా తిరిగేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ బాలాజీనాయక్, తండా వాసులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఉద్యోగం ఇవ్వాలి



మృతి చెందిన వారికి సంతాపం తెలుపుతున్న నాయకులు

మహబూబాబాద్ అర్బన్: ఒడిసాలో జరిగిన రైలు ప్రమాదంలో మరణించిన కుటుంబాలకు ఉద్యోగాలు ఇవ్వాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి మైన శ్రీనివాసులు, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు మండల వెంకన్న డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖాన నుంచి కోర్టు వరకు సంతాప ర్యాలీని టీపీటీఎఫ్ , న్యూడెమోక్రసీ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఘోర రైలు ప్రమాదానికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. రైల్వే నిర్వహణలో ముఖ్యపాత్ర పోషించే సిగ్నల్ సిస్టంను అధునాతన సాంకేతిక పరికరాలతో అమర్చాలన్నారు.ఈ సంఘటనకు దేశ ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలన్నారు.కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బలాష్టి, రమేష్ జిల్లా కార్యదర్శి సోమ విష్ణువర్ధన్, ఉపేందర్, విద్యాసాగర్, వై.యాకయ్య, బి.జబర్లల్, ప్రకాశం, బాబురావు, మోహన్, కోడెం శ్రీనువాస్ రవి డి.వీరన్న, జి.కార్తీక్, బాధ్యులు విజయ్ పాల్గొన్నారు.

ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకుందాం



కాంతారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రభాకర్

గంగారం: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకుందామని ఐటీడీఏ పీసా కోఆర్డినేటర్ కొమురం ప్రభాకర్ అన్నారు. మండలంలోని 12 గ్రామపంచాయతీ మొబిలైజర్లతో సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను వివరించారు.కార్యక్రమంలో సర్పంచ్ ఇర్ప సూరయ్య, పీసా కమిటీ మండల అధ్యక్షుడు ఈక సురేందర్, మొబిలైజర్స్ తదితరులు పాల్గొన్నారు. ఈసం కాంతారావు మొదటి వర్ధంతికి ప్రభాకర్ హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.